క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేసిన సుప్రభాతరావు

రామాయంపేట(మెదక్): బీసీ కాలనీకి మంజూరైన సీసీ రోడ్డు పనులకు గురువారం పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డు నిర్మాణానికిగాను రూ.కోటి మంజూరయ్యాయని తెలిపారు. పనులు నాణ్యతగా, త్వరితగతిన చేయాలని సూచించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, నాయకులు యాదగిరి పాల్గొన్నారు.

వనమహోత్సవంలో భాగస్వాములు కావాలి



విద్యార్థులకు మొక్కలు అందజేస్తున్న అధికారులు

పెద్దశంకరంపేట(మెదక్): వనమహోత్సవంలో అందరూ భాగస్వాములు కావాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ షాకీర్‌అలీ, ఎంఈఓ వెంకటేశం అన్నారు. గురువారం స్థానిక బాలికల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేశారు. మొక్కలు నాటడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మొక్కలు నాటడంతో పాటు సంరక్షణ చేపట్టాలని సూచించారు. దీంతో పాటు ఆయా గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి, మొక్కలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఓ సంతోష్‌కుమార్, ఉపాధ్యాయులు సంతోష్, పంచాయతీ కార్యదర్శి వెంకటరాములు, టీఏ మోహన్ తదితరులు ఉన్నారు.

పోలీసులకు రాఖీ కట్టిన మోర్చా సభ్యులు



పోలీసు అధికారులకు రాఖీలు కడుతున్న మల్లిక తదితరులు

మెదక్ మున్సిపాలిటీ: సమాజ రక్షణలో పోలీసు సిబ్బంది పాత్ర కీలకమని బీజేపీ జిల్లా మహిళా మోర్చా నాయకురాలు పి.మల్లిక అన్నారు. గురువారం మహిళా మోర్చా ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్ టౌన్ సీఐ, ఎస్‌ఐ, ఏఎస్‌ఐ, కానిస్టేబుళ్లకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా నాయకురాలు వీణ, సంగీత, ప్రవళిక, నిర్మల, శ్యామల, మౌలిక పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే నులి పురుగు నివారణ



మాట్లాడుతున్న ఎంఈఓ

శివ్వంపేట(నర్సాపూర్): అప్రమత్తతోనే నులి పురుగును నివారించవచ్చని ఎంఈఓ బుచ్చనాయక్, పీహెచ్‌సీ వైద్యురాలు సాయిసౌమ్య, అన్నారు. గురువారం ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, వివిధ శాఖల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకటి నుంచి 18 సంవత్సరాల వయస్సులోపు అందరూ నులి పురుగు నివారణ మాత్రలు వేసుకోవాలన్నారు. కడుపులో నులి పురుగులు ఉంటే రక్తహీనత వస్తుందన్నారు. ఈ నెల 11, 18వ తేదీల్లో మాత్రల పంపిణీ జరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థికి మాత్రలు వేయించడంతో ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ

మెదక్ మున్సిపాలిటీ: అర్హులందరికీ రేషన్ కార్డు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని మెదక్ పట్టణ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు భూపతి యాదవ్ అన్నారు. గురువారం మొదటి వార్డులో లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని ఆరోపించారు. పేదలకు సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, వంటి సంక్షేమ పథకాలను అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బుద్ధా వెంకటేశం ,యాదగిరి చంద్రమౌళి ,మల్లేశం, ప్రభు సురేష్ ,సత్యనారాయణ పాల్గొన్నారు.

ముందస్తు రాఖీపౌర్ణమి వేడుకలు



వెల్దుర్తి పాఠశాలలో రాఖీలు కడుతున్న విద్యార్థినులు

వెల్దుర్తి మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం ముందస్తు రాఖీ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో వనమహోత్సవంలో భాగంగా విద్యార్థులు మొక్కలు నాటి, వాటిని సంరక్షిస్తామంటూ మొక్కలకు రాఖీలు కట్టారు. పాఠశాలలో రాఖీ వేడుకలు నిర్వహించడం వల్ల విద్యార్థుల మధ్య స్నేహ సంబంధాలు మెరుగవుతాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. – వెల్దుర్తి(తూప్రాన్):



చందాపూర్ పాఠశాలలో రాఖీ కడుతున్న విద్యార్థులు

చిన్నశంకరంపేట మండలం చందాపూర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులు ముందస్తుగా రాఖీ పండుగను జరుపుకొన్నారు. ప్రధానోపాధ్యాయుడు పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో చిన్నారులు పరస్పరం రాఖీలు కట్టుకొని రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. చిన్నారులకు రాఖీబంధన్ ప్రాముఖ్యత గురించి వివరించినట్లు తెలిపారు. – చిన్నశంకరంపేట(మెదక్):



చేగుంట(తూప్రాన్): ఉన్నత పాఠశాలలో రక్షాబంధన్ జరుపుకుంటున్న విద్యార్థులు

పొదల్లో ట్రాన్స్‌ఫార్మర్

తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం

అల్లాదుర్గం(మెదక్): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పొదలు కమ్మేశాయి. చెత్తతో ట్రాన్స్‌ఫార్మరే కనిపించకుండా పోయింది. ట్రాన్స్‌ఫార్మర్ స్తంభం పై వరకు తీగలు అల్లుకున్నాయి. దీంతో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడంతో పాటు, వైర్లు తెగిపడుతున్నాయి. అల్లాదుర్గంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పొదల్లో ఉండటంతో ఏదైనా మరమ్మతు చేయాలంటే వెళ్లలేని దుస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను తీగలు అల్లుకోవడంతో గాలివానకు విద్యుత్ సరఫరా నిలిపోతుందని , మరమ్మతులు చేయడానికి రెండు, మూడు గంటలు పడుతుందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ మరమ్మతులకు ప్రభుత్వం లక్షలు మంజూరు చేసి, కాంట్రాక్టుకు అప్పగించిన పనులు చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇలా ట్రాన్స్‌ఫార్మర్ పొదల్లో ఉంటే ప్రమాదాలు జరగవా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



అల్లాదుర్గంలో పొదల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



ట్రాన్స్‌ఫార్మర్ స్తంభం పైకి అల్లుకున్న తీగలు

మోర్చా ఆధ్వర్యంలో రక్షాబంధన్

పాపన్నపేట(మెదక్): బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో గురువారం పాపన్నపేటలో రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. సైనికులకు ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ పోలీసులకు రాఖీలు కట్టారు. అనంతరం వారికి మిఠాయిలు తినిపించి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మల్లిక, మండలశాఖ అధ్యక్షురాలు పద్మ, నాయకులు దివ్య, శోభ, శైలజ, మహేశ్వరి, సరిత, రేణుక, భవానీ, శోభ, శ్యామమ్మ, పాల్గొన్నారు. కాగా, మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గడప గడపకు బీజేపీ నాయకులు పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా శాఖ అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, మండల అధ్యక్షుడు సంతోష్,కిసాన్ మోర్చా అధ్యక్షుడు బైండ్ల సత్యనారాయణ, బీజేవైఎం ఉపాధ్యక్షుడు శ్రీరాం నరేష్, సుధాకర్, నారాయణ, ఇమానియల్, బి.కొండ రాములు తదితరులు పాల్గొన్నారు.



పోలీసులకు రాఖీ కడుతున్న మల్లిక

మౌలిక నైపుణ్యాలు మెరుగుపడాలి

మండల విద్యాధికారి విఠల్

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో గణితానికి సంబంధించిన గుణకారము, భాగహారము లాంటి కనీస మౌలిక నైపుణ్యాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని మండల విద్యాధికారి విఠల్ సూచించారు. గురువారం ఆయన మండల పరిధిలోని గౌతాపూర్, మల్లక్కచెరువు తండా ప్రాథమిక పాఠశాలను సందర్శించి, ఉపాధ్యాయుల బోధన పద్ధతులు, వారి పనితీరు, విద్యార్థుల నోట్ బుక్కులు. వారి సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక దశనే పునాది వంటిందని చెప్పారు. ఈ స్థాయిలో వారి నైపుణ్యాలను అభివృద్ధి చేయాల్సి బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. ఉపాధ్యాయులు సులభమైన బోధన పద్ధతులు పాటించి, విద్యార్థుల నైపుణ్యాలు మెరుగుపరచాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు, సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్ ప్రతినిధి ఆదిత్య పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ విఠల్

విడతల వారీగా యూరియాను వాడాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): పంటల సాగుకు యూరియాను విడతల వారీగా వాడాలని, అలా వాడటం మూలంగా నత్రజని నష్టాన్ని తగ్గిస్తుందని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన శీలాంపల్లి గ్రామ రైతులకు యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూరియా విడతలవారీగా వాడితే పంటకు అందే పోషకాల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు, పెట్టుబడి ఖర్చు తగ్గిస్తుందని చెప్పారు. పైగా నేల సారవంతమవుతుందని తెలిపారు. రైతులు, అధికారుల సిఫార్సు మేరకే ఎరువులు వాడాలని, మోతాదుకు మించి ఎరువులు వాడితే, చీడపీడలు సోకే అవకాశం ఉందన్నారు. రైతులు యూరియా వాడకాన్ని గణనీయంగా తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కృష్ణవేణి ఉన్నారు.

తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యకరం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి



సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న అధికారులు

వెల్దుర్తి(తూప్రాన్): తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యకరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి అన్నారు. వెల్దుర్తి మండలం శేరీల అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక సీమంతాలు, అన్నప్రాసన వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పిల్లలు పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగిస్తే పిల్లల్లో రోగనిరోధకశక్తి పెరుగుతోందని తెలిపారు. ఈ విషయాన్ని గర్భిణిలకు వివరించి ప్రతిఒక్కరూ తమ పిల్లలకు ముర్రుపాలు తాగించేలా అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు తప్ప మరేం పట్టకూడదన్నారు. ఆరు మాసాల తర్వాత బిడ్డకు తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డా.శిరీష, డా.సౌజన్య, అంగన్‌వాడీ టీచర్లు దేవలత, మంగేశ్వరి, దుర్గ, లక్ష్మి, వసంత, నాగమణి, ఏఎన్‌ఎం అనిత, ఆశావర్కర్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

పంట సాగులో జాగ్రత్తలు

- పరిస్థితులకు అనుకూలమైన పంటలు సాగు చేయాలి
- మ్యాప్ చూపుతూ రైతులకు వర్సిటీ విద్యార్థుల అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న అగ్రికల్చర్ విద్యార్థులు

కౌడిపల్లి(నర్సాపూర్): పంటసాగులో సరైన జాగ్రత్తలు పాటించి, పరిస్థితులకు అనుకూలమైన పంటలు సాగు చేయాలని మల్లారెడ్డి వ్యవసాయ యూనివర్సిటీ విద్యార్థులు అన్నారు. కేవీకే తునికి శాస్త్రవేత్తలు డాక్టర్, భార్గవి, రవికుమార్ ఆధ్వర్యంలో గురువారం వ్యవసాయ విద్యార్థులు గ్రామీణ కృషి అనుభవంలో భాగంగా కౌడిపల్లి మండలం తునికి గ్రామంలో గ్రామీణ విశ్లేషణాత్మక సదస్సు నిర్వహించారు. గ్రామం, నేలలు, పంటలసాగు, రైతులు వాడిన ఎరువులు తదితర వాటి మ్యాప్ వేసి, రైతులకు గ్రామ స్థితి గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటసాగులలో వస్తున్న నూతన పద్ధతులను ముందుగానే రైతులకు తెలియజేస్తామన్నారు. రైతులు సాగు చేస్తున్న పంటలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంటలకు వచ్చే వ్యాదులు, చీడపీడల గురించి ముందుగానే తెలుసుకోవడం వంటి సూచనలు ఇస్తామన్నారు. రైతులకు అర్థమయ్యేలా సమాచారాన్ని చార్ట్‌లు, పోస్టర్‌ల రూపంలో అవగాహన కల్పిస్తామన్నారు. తద్వారా రైతులు పంట సాగు విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ విద్యార్థులు ఝాన్సీ, హరిప్రియ. వైష్ణవి, గాయని, అశ్వినికుమారి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

క్యూబా సంఘీభావ నిధి సేకరణ



క్యూబా సంఘీభావ నిధిని సేకరిస్తున్న సీపీఎం నాయకులు

హవేళిఘణాపూర్(మెదక్): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విదేశాలకు సుంకాలను విధిస్తూ దేశం ఆదాయాన్ని కొల్లగొడుతున్నాడని సీపీఎం కార్యదర్శివర్గ సభ్యులు మల్లేశం అన్నారు. గురువారం హవేళిఘణాపూర్‌లో అమెరికా సుంకాలు విధిస్తూ దోచుకుంటున్న తీరును వ్యాపారులకు వివరిస్తూ క్యూబా సంఘీభావ నిధిని సేకరించారు. అనంతరం మల్లేశం మాట్లాడుతూ అమెరికాలో ట్రంపు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇతర దేశాలపై సుంకాలను విధించడమే కాకుండా చిన్న చిన్న దేశాల మధ్య యుద్ధానికి ఉసిగొలుపుతూ తాను పెత్తనం చెలాయించేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం దేశంలో సుంకాల విధింపును వెనక్కి తీసుకోకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దుర్గా, మల్లేశం, నాగరాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

మండల వ్యవసాయాధికారి రాజశేఖర్‌గౌడ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఎరువులు, విత్తనాల విక్రయాల డీలర్లు, ఫర్టిలైజర్ దుకాణా యజమానులు, ఎరువుల విషయంలో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే తగిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్‌గౌడ్ అన్నారు. గురువారం చిలప్‌చెడ్ మండలం అంతారంలోని ఫర్టిలైజర్ దుకాణాన్ని ఆయన తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఆర్‌పీ ధరకే ఎరువులు అమ్మాలన్నారు. రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రశీదు తీసుకోవాలన్నారు. కృత్రిమ యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.



అంతారంలో గల ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ రాజశేఖర్‌గౌడ్

చేనేతను కాపాడుకుందాం

డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేష్ కుమార్



రంగంపేటలో చేనేత దినోత్సవంలో పాల్గొన్న కార్మికులు

కొల్చారం(నర్సాపూర్): ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించేలా ప్రచారం చేయాలని, అలాగే.. వృత్తిని కాపాడుకుందామని మండలంలోని రంగంపేట చేనేత కార్మికులు పేర్కొన్నారు. చేనేత సహకార సంఘం ఆవరణలో గురువారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారతదేశ వస్త్ర వారసత్వానికి పునాదిగా ఉన్న చేనేత వృత్తిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేష్ కుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి ఇక్కడి చేనేత వృత్తికి జీవం పోసి కార్మికులను ఆదుకోవాలని చేనేత కార్మికులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు వెంకటనారాయణ, డైరెక్టర్లు హరిదాసు, సత్యనారాయణ, కార్మికులు రమేష్ బాబు, నాగరాజు, రమేష్, వీరేశం, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని బీజేపీ నాయకులు నత్తి మల్లేష్, మండల బీజేపీ అధ్యక్షుడు బక్క వెంకటేష్‌గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని కాళ్ళకల్, జీడిపల్లి గ్రామాలలో బూత్ స్థాయిలో ఇంటింటికి తిరిగి కేంద్రంలో బీజేపీ ఉండటంతోనే నిధులు గ్రామాలకు అందుతున్నాయని, ఇచ్చిన హామీలను కాంగ్రెస్ తుంగలో తొక్కిందని ప్రజలకు వివరించారు. వీరి వెంట జిల్లా కౌన్సిల్ సభ్యుడు నరేందర్‌చారి, మండల ఉపాధ్యక్షులు నత్తి మల్లేష్, నాగేష్, గోపాల్, గణేష్, అనిల్ , నాగరాజు, ప్రణయ్, ఎర్ర ప్రవీణ్, కుమార్, తదితరులు ఉన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి కృష్ణ

పెద్దశంకరంపేట(మెదక్): అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి కృష్ణ అన్నారు. గురువారం పెద్దశంకరంపేటలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఎరువుల స్టాక్ వివరాలను పరిశీలించారు. దీంతో పాటు మండల పరిధిలోని కమలాపూర్‌లో ఆయిల్‌పామ్ పంట సాగు చేసుకునేందుకు రైతులకు అవగాహన కల్పించారు. రైతులు ఆయిల్‌పామ్ పంటల సాగుపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు వినీత్, అఖిల్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ మాణిక్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈఓ రవీందర్ తదితరులు ఉన్నారు.



పెద్దశంకరంపేటలో ఎరువుల వివరాలు పరిశీలిస్తున్న ఏఓ

సంక్షిప్త వార్తలు

◆ కేంద్ర పథకాలపై విస్తృత ప్రచారం

వెల్దుర్తి(తూప్రాన్): మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వెల్దుర్తిలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ గురువారం బీజేపీ మండల కమిటీ విస్తృత ప్రచారం నిర్వహించింది. కరపత్రాలు పంపిణీ చేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దాసు, మండల ఇంఛార్జ్‌లు బాలరాజు, అశోక్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శేఖర్‌గౌడ్, వెంకటేశం, బాలకిషన్, రమేశ్, శివరాం, హరిబాబు, రంజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

కౌడిపల్లి(నర్సాపూర్): సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అంగన్‌వాడీ టీచర్లు అన్నారు. గురువారం వారు మండల కేంద్రమైన కౌడిపల్లిలో జ్వర సర్వే నిర్వహించి, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాకాలం సీజన్‌లో దోమలు రాకుండా ఉండేందుకు, నిల్వ నీటిని ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం శోభారాణి పాల్గొన్నారు.

◆ అంగన్‌వాడీ కేంద్రానికి గ్యాస్ స్టవ్ పంపిణీ

కౌడిపల్లి(నర్సాపూర్): మండల పరిధిలోని మహ్మద్ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రానికి గురువారం గ్రామ యువ నాయకుడు రవియాదవ్ గ్యాస్ స్టవ్ పంపిణీ చేశాడు. కార్యక్రమంలో సొసైటీ మాజీ డైరెక్టర్ వెంకన్న, అంగన్‌వాడీ టీచర్ నిర్మల పాల్గొన్నారు.

◆ సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

పెద్దశంకరంపేట(మెదక్): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ షాకీర్‌అలీ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఇసుకపాయల తండాలో ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. మురుగుకాల్వలు శుభ్రపర్చడంతో పాటు టైర్లు, పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, దోమల బారిన పడకుండా ఉండాలని, కలుషిత నీరు తాగవద్దని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి షరీఫాద్దీన్, సూపర్‌వైజర్లు యాదయ్య, వెంకటరమణాబాయి తదితరులు పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్ నేతలను పరామర్శించిన మైనంపల్లి

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కోడూరి రమేష్‌గౌడ్‌ను మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు గురువారం పరామర్శించారు. వారం క్రితం గుండెపోటుతో ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఆరోగ్యం గురించి ఆరాతీశారు. ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటానని భరోసా కల్పించారు. అలాగే కొర్విపల్లికి చెందిన కాంగ్రెస్ ఎస్సీ సెల్ కార్యదర్శి రామ్ చంద్రంను కూడా పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాన సత్యనారాయణ, రాజిరెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

◆ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి

చిన్నశంకరంపేట(మెదక్): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని నార్సింగి ఎంపీడీఓ ఆనంద్ కుమార్, తహసీల్దార్ గ్రేసిబాయి కోరారు. గురువారం నార్సింగి మండలం వల్లూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. అలాగే గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను పరిశీలించి గ్రామ కార్యదర్శి అంజిరెడ్డికి పలు సూచనలు చేశారు.

◆ కాలువల్లోకి నీరు వదిలితేనే పంటలు

చేగుంట(తూప్రాన్): బీఆర్‌ఎసస్ ప్రభుత్వం హయాంలో తవ్విన కాళేశ్వరం కాలువల్లో నీళ్లు వదిలితేనే పంటలు పండుతాయని మాజీ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. దుబ్బాక నియోజకవర్గంలోని చేగుంట మండలం గ్రామాల మీదుగా రామాయంపేట కెనాల్ ఉండగా కాలువ నీటితో ఇక్కడి రైతులు పంటలు పండించుకునేవారని తెలిపారు. రామాయంపేట, చిన్నశంకరంపేట కాలువలకు ప్రభుత్వం నీళ్లు వదలకుంటే నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో చేగుంట పట్టణ అధ్యక్షుడు యాదగిరి, మండల శాఖ అధ్యక్షుడు నారాయణరెడ్డి, యూత్ నాయకులు రాజు తదితరులు ఉన్నారు.

◆ సామూహిక సీమంతాలు

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని కాయిదంపల్లిలో తల్లి పాల వారోత్సవాలలో భాగంగా గురువారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్ వైజర్ నాగమణి మాట్లాడుతూ.. గర్భిణీలు ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, సీహెచ్‌ఓ సుదర్శన్, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.